క్లుప్తంగా

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు



ఏపీఓను సన్మానిస్తున్న ఏపీడీ పద్మావతి

మద్దికెర : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీడీ పద్మావతి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించాలన్నారు. నిబంధనల మేరకు పనులు పూర్తి చేసిన వారికి పూర్తి స్థాయిలో వేతనాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏపీఓ రవీంద్రనాథ్ బదిలీపై నంద్యాల జిల్లాకు వెళ్తున్న సందర్భంగా ఏపీడీ, ఎంపీడీఓ నరసింహమూర్తి, సిబ్బంది సన్మానం చేశారు. కార్యక్రమంలో ఈసీ రాఘవేంద్ర, టీఏ వెంకటేశ్వరరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజు, హనుమేష్, శివ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించాలి

తుగ్గలి : కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ రవి బీఎల్‌వోలను ఆదేశించారు. బుధవారం జొన్నగిరిలో జడివానలోనే పలువురి ఇళ్లకు వెళ్లి ఓటర్లను కలిసి ఎంత మంది ఉన్నారు..ఎన్ని ఓట్లు ఉన్నాయనే దానిపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శక మైన ఓటరు జాబితా తయారీకి సంబంధించి ఈనెల 21 నుంచి పోలింగ్ బూత్‌ల వారీగా సర్వే చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితాలను తొలగించాలని సూచించారు. అదే విధంగా 18 ఏళ్లు నిండిన వారు ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. రాజకీయపార్టీలు, ఓటర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు అనంతస్వరూప్, నాగేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని భాష్యం పాఠశాలకు ఒక దానికి అనుమతి వుంటే అదనంగా మరో పాఠశాలను నిర్వహిస్తున్నారని, ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు బుధవారం పట్టణంలో ఆందోళన చేపట్టాయి. ఇందులో భాగంగా పీడీఎస్‌యూ, టీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య, యుఎస్ఎఫ్ఐ, ఆర్ఏవీఎఫ్, ఆర్‌పీఎస్ తదితర సంఘాల నాయకులు సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన స్పందించి పాఠశాలపై విచారణ నివేదిక పంపాలని ఎంఈఓలు ఆంజనేయులు, మధుసుదన్‌రాజులను ఆదేశించారు. నాయకులు రాజేష్, శేఖర్, ఉదయ్, కృష్ణ, ఖాజ, నల్లారెడ్డి, అఫ్రిది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. రోగుల వార్డుకు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో శానిటేషన్, రికార్డులు, వార్డులు, సీసీ కెమోరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మిగనూరు ఆసుపత్రి వైద్య సేవలు అందించటంలో, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటంతో మొదటి, రెండవ స్థానాల్లో ఉంటుందని తెలిపారు. రోగులు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి దస్తగిరి

పత్తికొండ రూరల్ : నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఉద్యానశాఖ అధికారి దస్తగిరి తెలిపారు. బుధవారం పత్తికొండలోని కూరగాయల నర్సరీలను తనిఖీ చేశారు. నర్సరీ పెంపకందారులు మిరప, టమాట, ఇతర కూరగాయల విత్తనాలు అధీకృత డీలర్ల నుంచి కొనుగోలు చేయాలన్నారు. నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాని సూచించారు. దేవనకొండ, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లో మొత్తం 42 నర్సరీలు ఉన్నాయని చెప్పారు. వాటి యజమానులు సీడ్స్‌సేల్స్ ప్లాంట్ ప్రొటెక్షన్ రిపోర్టు తనిఖీ రిజిస్టర్ తప్పనిసరిగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. హోసూరు ఉద్యాన సహాయకుడు శివ, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- ఇంగదహాళ్ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను బుక్‌లెట్ ద్వారా వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. హొళగుంద మండలం ఇంగదహాళ్ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ప్రమీదవ తమ్మ ఆధ్వర్యంలో మంత్రి గుమ్మనూరు జయరాం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో రూ. 45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను బుక్‌లెట్ అందజేసి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంజూరు చేసిన సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అందించలేదన్నారు. గ్రామంలో వెయ్యి ఎరకాల వ్యవసాయ భూమి ఉందని, రైతులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ ద్వారా వారు ఖాతాలలోకి రూ 42,72,500 జమ చేసిందని చెప్పారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి దహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం రూ. 44 లక్షలకు టెండర్లు పిలిచి ఇంటింటా తాగునీటికి సదుపాయం, మరో రూ.30 లక్షలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులపై, బీసీ సంక్షేమ గృహంలో నెలకొన్న విద్యార్థుల మరుగు దొడ్లు సమస్యపై ఆశాఖ ఛీఫ్ సెక్రటరీ అనంతరాంతో చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కో–ఆర్డినేటర్ నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాధ, ఎంపీపీ షేకుంబీ, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు కమిటీ కార్యదర్శి ప్రహ్లాద్‌రెడ్డి, గోనేహాళ్ సర్పంచ్ వెంకట రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లికార్జున, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మల్లికార్జున, నాయకులు వెంకటరామిరెడ్డి, షఫివుల్లా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..



కర్నూలు ఆస్పత్రిలో లక్ష్మానాయక్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుశీలాబాయి

చిత్రంలో పింఛన్ అందిస్తున్న మహిళా వలంటీర్ సుశీలాబాయిది ఎల్లమ్మ గుట్టతండ. అదే తండాకు చెందిన లక్ష్మానాయక్ తనకున్న రెండున్నరెకాలలో వ్యవసాయం చేసుకుంటూ కూలీ పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. అనుకోకుండా గతేడాది ఏప్రిల్‌లో గుండె నొప్పి రావడంతో కర్నూలు మెడికవర్ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ఆపరేషన్ చేసి స్టంట్ వేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో వలంటీర్ సుశీలాబాయి లక్ష్మానాయక్‌కు పింఛన్ డబ్బులు అందిస్తే ఖర్చులకై నా వస్తుందని భావించి వ్యయప్రయాసలుకోర్చి కర్నూలుకు వెళ్లి పింఛన్ డబ్బులు అందించి పలువురి ప్రశంసలు అందుకుంది. – తుగ్గలి

ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించింది



గుండె నొప్పితో ఆస్పత్రిలో చేరా. పరీక్షించిన వైద్యులు తప్పనిసరి కావడంతో ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో మా వలంటీర్ సుశీలబాయి ఆడపిల్ల అయినా ప్రయాసలతో ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు అందించడం ఎంతో సంతోషం కలిగించింది. కష్టకాలంలో వలంటీర్ సేవలు మరువలేను. సేవలు పొందే వారికే వలంటీర్ విలువ తెలుస్తుంది.

– లక్ష్మానాయక్, ఎల్లమమ్మగుట్టతండ

పేదలకు అండగా 'జగనన్న సురక్ష'



కృష్ణగిరిలో యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు అండగా నిలుస్తోందని మండల వైస్ ఎంపీపీ బోయ సుశీల, కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా అన్నారు. మండల కేంద్రంతోపాటు తొగర్చేడు గ్రామాల్లో ఎంపీడీఓ విశ్వమోహన్, తహసీల్దార్ రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో కలిసి 79 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అంకాల మహాలక్ష్మి, జయరామిరెడ్డి, చిన్నన్న, హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సేవలు

తుగ్గలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే సేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ నాగభూషణరెడ్డి, సర్పంచ్ మసీంద్ర, వైఎస్ ఎంపీపీ నాగప్ప అన్నారు. బుధవారం రాంపల్లి, జొన్నగిరిలో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రితో కలిసి వారు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోటలో బుధవారం డీటీ ప్రసాద్‌రాజు, ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, బీటీ నాయుడు చేతుల మీదుగా 290మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

మద్దికెర : స్థానిక జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ –2 పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ రంగస్వామి, ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలు మౌలిక వసతులు కల్పించడమే గాకుండా ఉచితంగా జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు.

వీఆర్ఏల న్యాయమైన కోర్కెలు తీర్చండి

మద్దికెర : వీఆర్ఏల న్యాయమైన కోర్కెలు తీర్చాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు ఈరన్న, ఉపాధ్యక్షులు సుంకన్న కోరారు. బుధవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగభూషణంకు అందజేశారు. వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలనే డిమాండ్లను నెరవేర్చుకోడానికి ఈనెల 20, 21వ తేదీలలో రెండు రోజుల పాటు నిరాహారదీక్షలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీరా,రాముడు, దామోదర్, ఆనందు, కిష్టప్ప, అంజనయ్య, శేఖర్, కోండడ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వాహన మిత్ర, కాపు నేస్తం పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో.. వాహన మిత్ర పథకానికి దరఖాస్తు చేసుకున్న 12 మంది వివరాలను ఎంపీడీఓ పరిశీలించారు.అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వాహన మిత్ర, కాపునేస్తం పథకాలకు కావాల్సిన అర్హతలను వివరించారు. వాహన మిత్ర పథకానికి ఈనెల 25వ తేదీలోగా, కాపు నేస్తంకు ఈ నెల 22వ తేదీలోగా అర్హులైన వారు స్థానిక గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్‌ను సిఫారసులు అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్నగౌడ్ కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 50సంవత్సరాలు పైబడిన రైతులు, కౌలు రైతులు నెలకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు అబ్దుల్లా, రైతు సంఘ తాలుకా కార్యదర్శి కెసీ జబ్బార్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

23న రేషన్ డీలర్ల మహాసభ

వెల్దుర్తి: ఈనెల 23న విజయవాడలో రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల మహాసభను నిర్వహించనున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఖాద్రి బాషా, ఉమ్మడి జిల్లాల కన్వీనర్ కరీముల్లా తెలిపారు. బుధవారం వారు స్థానిక భజన మందిరంలో వెల్దుర్తి, కృష్ణగిరి జిల్లాల రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. మంత్రులు, సివిల్ సప్‌లైస్ ప్రజాప్రతినిధులు సైతం మహాసభకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఆదాయ భద్రత డిమాండ్లతో నిర్వహిస్తున్న మహాసభలో ప్రతి డీలర్ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓర్వకల్లు శ్రీను, గోపీనాథ్ నాయుడు, లింగారెడ్డి, కంగాటి వెంకట్రామిరెడ్డి, నార్లాపురం సర్పంచ్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎరుకలయ్య గారి చిన్న అయ్యస్వాములు రెండు రోజులు క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని సచివాలయ కన్వీనర్ తెలుగు వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం అందజేయాలని ఆదేశించారు. దీంతో బుధవారం మృతుని కుటుంబసభ్యులైన ఎరుకలయ్య గారి లింగన్నకు బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలను వైఎస్సార్ సీపీ నాయకులు తెలుగు వెంకటేష్, బేతాపల్లె సుధాకర్, సచివాలయ వేల్ఫేర్ అసిస్టెంట్ వెంకటస్వామితో కలిసి అందజేశారు.

రైతులకు సహాయాన్ని పెంచండి

వెల్దుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులందిస్తున్న సహాయాన్ని పెంచాలని, ఎకరాకు రూ.10వేలు అందించాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాధవకృష్ణ, బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు సీపీఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

సంక్షిప్తం

పెద్ద నేలటూర్‌లో నెమళ్ల సంచారం



గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామ శివార్లలో బుధవారం ఉదయం నెమళ్లు సంచరించాయి. ఎప్పుడూ రాని నెమళ్లు అడవి, పంట పొలాలు వదిలి గ్రామ శివార్లలో రావడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. అవి కొద్ది సమయం సంచరించి మళ్లీ పొలాల వైపు వెళ్లిపోయాయి. ఇంతకాలమైనా పొలాల్లో పంటలు సాగు చేయకపోవడంతో ఆహారం కోసం గ్రామ శివార్లలోకి వచ్చినట్లు తెలుస్తోంది.

ఆంజనేయస్వామి హుండీ చోరీ

ఆలూరు: హొళగుంద మండలం పెద్దగోనేహాళ్ గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని ఆంజనేయస్వామి హుండీని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆయలంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు హుండీని ఎత్తుకెళ్లిన విషయం గుర్తించారు. దుండగులు హుండీని గ్రామ శివారులోని పొలంలో పడేసి వెళ్లారు. హుండీలో రూ 15 వేల నగదును అపహరించుకుపోయారని సర్పంచ్ వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌలు రైతులకు కార్డులు అందించాలి

వెల్దుర్తి: కౌలు రైతులను గుర్తించి, యజమానులకు అవగాహన కల్పించి, కైలు రైతు కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ ఆర్బీకేల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఏఓ అక్బర్ బాషాతో కలిసి మండల పరిధిలోని బుక్కాపురం, కలుగొట్ల, పుల్లగుమ్మి గ్రామాలలోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలో సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం మండలంలోని వాతావరణ పరిస్థితులు, సాగు వివరాలు తెలుసుకున్నారు. పీఎం కిసాన్ పథకం పెండింగ్ ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

పచ్చారపల్లిలో 'జూనియర్ మిస్' లేక్ కౌంటీ



కీర్తిని శాలువాతో సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

హాలహర్వి: అమెరికాలోని లేక్ కౌంటీ కార్యక్రమంలో 2023 సంవత్సరానికి జూనియర్ మిస్ విజేతగా నిలిచిన కీర్తి పచ్చారపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో గడిపారు. చదువులో రాణించాలని సూచించారు. తనది హైదరాబాద్ అని, పచ్చారపల్లిలో బంధువులు ఉండటంతో ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. మొత్తం 103 రాష్ట్రాలకు చెందిన యువతులు పోటీలో పాల్గొనగా తనకు జూనియర్ మిస్ కిరీటం దక్కిందన్నారు. పచ్చారపల్లిలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.10 వేల ఆర్థిసాయాన్ని భగత్‌సింగ్ యూత్ అధ్యక్షుడు జనార్దన్‌కు అందజేశారు. అనంతరం ఆమె పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

దేవనకొండ : మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, పీర్లచావిడీల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పీర్లదేవుళ్లను ఏర్పాటు చేసుకునే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ భూపాలుడు, జెడ్పీటీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడి మృతి

తుగ్గలి : వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప్పర్లపల్లి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వరరెడ్డి(60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఏడాదిగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన రెండున్నర నెలల క్రితం భార్య కిడ్నీ ఇవ్వడంతో ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే ఇన్ఫెక్షన్ సోకడంతో 20 రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. వైద్యుల సూచనల మేరకు 10 రోజుల క్రితం అక్కడి నుంచి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఉదయం మృతి చెందారు. వెంకటేశ్వరరెడ్డికి భార్య కృష్ణవేణమ్మ, కుమారులు మనోహరరెడ్డి, జనార్దనరెడ్డి ఉన్నారు.

ఉత్తమ బోధనతోనే గుర్తింపు

నందవరం : ఉత్తమ బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ, ప్రమోషన్ పొందిన హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన హెచ్ఎం అరుణ, హెచ్ఎంగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన రామలింగప్ప, లచ్చప్ప, రాముడు, భోజరాజు, ఉపాధ్యాయులు రామిరెడ్డి, రంగమ్మ, నసిమునిసా, ప్రవీణ్‌కుమార్, వర్క్ అడ్జెస్‌మెంట్ ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. ఎంఈఓ–2 రఘునాథ్, హెచ్ఎం శివరాం పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

హాలహర్వి : పీఎం కిసాన్ నగదు ఈనెల 28వ తేదీన రైతుల ఖాతాల్లో జమ అవుతుందని అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ శివ శంకర్ సూచించారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు నగదు జమ కాదని, వెంటనే చేయించుకోవాలని చెప్పారు.

కృష్ణగిరి తహసీల్దార్‌గా రాజేశ్వరి

కృష్ణగిరి: కృష్ణగిరి మండల తహసీల్దార్‌గా పి. రాజేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు వీఆర్వోలు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

వెల్దుర్తి: మండల తహసీల్దార్‌గా ఎమ్ శివరాముడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజేశ్వరి కృష్ణగిరికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో శివరాముడు నియమించబడ్డారు. డీటీ ప్రసాద్ రాజు, ఆర్ఐ మస్తాన్, సిబ్బంది, డీలర్లు, నాయకులు నూతన తహసీల్దార్‌కు బొకేలతో స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆలూరు రూరల్: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొడంతో పక్కీరప్ప (38) అనే వ్యక్తి మృతిచెందగా భార్య నీలమ్మ, బావమరిది మారెన్న తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం మండలంలోని గోనేహాల్ బస్టాండు సమీపంలో హైవే 167లో ప్రమాదం జరిగింది. కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామానికి చెందిన పకీరప్ప భార్య, బావమరిదితో కలిసి పని నిమిత్తం ఆలూరుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడ్డ వారిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. పక్కీరప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఆలూరు ఆస్పత్రి తరలించారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

చిప్పగిరి: మండలంలోని సంగాల గ్రామంలో ప్రజల, పెద్దల ఆధ్వర్యంలో ఈ నెల 24 న నిర్వహించు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించు అన్నదాన కార్యక్రమానికి బుధవారం చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి రూ 20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీమలింగ, ఓబులేషు, రామాంజి, రాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అపహరణ

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో ఉన్న ట్రాక్టర్ అపహరణ గురైనట్లు ఎస్ఐ. సురేష్ బుధవారం తెలిపారు. కర్నూలుకు చెందిన అల్లావుద్దీన్ అమకతాడు సమీపంలో పొలం పనులు చేస్తూ సమీపంలోని ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు డోజర్‌ను స్వామి గుడి వద్ద పెడుతున్నాడు. దీన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి



వెంకటాపురం కాలనీలో జాబితాను పరిశీలించిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: బూత్‌లెవల్ ఆఫీసర్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 22 వరకు బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాను చెక్ చేయాలని, ఏమైన తప్పులుంటే పైస్థాయి అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జాబితాలో చనిపోయిన వారి పేర్లు ఉంటే తొలగించాలని, కొత్తగా ఓటరు నమోదు చేసుకునేవారికి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల నాటికి తప్పులులేని ఓటరు జాబితాను సిద్ధం చేయ్యాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వెంకటాపురం కాలనీలో ఒక ఇంట్లో 21 కంటే ఎక్కువ ఓట్లు ఉండటంతో క్షేత్ర స్థాయిలో వెళ్లి జాబితాను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ఉన్నపేర్లు వున్నవారు అక్కడ లేరని తెలుసుకొని వారి పేర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీవర్స్ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మోను పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఓటరు జాబితా నమోదు, తొలగింపులపై అన్ని పార్టీ నాయకుల అభిప్రాయాలను తీసుకోనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హాజరవుతారన్నారు.

ఏ ఒక్కరూ ఓటుహక్కు కోల్పోకూడదు

గోనెగండ్ల; ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణలపై వీఆర్వోలు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల పట్ల బాధ్యతాయుతంగా పనిచేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన విక్రయాల నిలిపివేత

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని పది విత్తన దుకాణ విక్రయాల్లో రూ. 36.90 లక్షల విలువ చేసే విత్తన విక్రయాలు నిలుపుదల చేసినట్లు కర్నూలు ఏడీఏ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల వ్యవసాధికారి మహేశ్వరరెడ్డి, శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ . మంజునాథ ట్రేడర్స్‌లో రూ. 4,59,550, శివసాయిలో రూ. 8,16,939, నందీశ్వర ట్రేడర్స్‌లో రూ. 9,75,257, కిరణ్ హైబ్రిడ్ సీడ్స్‌లో రూ. 12,55,700, లక్ష్మీ శ్రీనివాసలలో రూ.1,39,563 విలువ చేసే విత్తన విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు. విత్తన విక్రయాలకు సంబంధించిన సర్టిఫికెట్స్ చూపించే వరకు విక్రయాలు జరపరాదని ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎమ్మిగనూరురూరల్: తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మదుసూదన్ రావు హెచ్చరించారు. బుధవారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో తోపుడు బండ్లతో పాటు, ఇతర వ్యాపారులందరికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తోడుపు బండ్ల వ్యాపారులు పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధగా ఎక్కడి పడితే అక్కడ నిలుపుకొని పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. ఇకపై రోడ్లపై తోపుడు బండ్లను పెట్టి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేయటంతో పాటు బండ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు రంగన్న, రాముడు, రాజు, అంథోని, పట్టణ, ట్రాఫిక్ ఎస్ఐలు మస్తాన్‌వలి, సురేష్‌బాబు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

హాలహర్వి : సచివాలయ అధికారులు గ్రామాల్లోని ప్రజలకు కొత్త ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీఓ ఆంతోని, హాలహర్వి తహసీల్దార్ మల్లికార్జున, ఆలూరు తహసీల్దార్ రామాంజనేయులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు ఆర్ఓ మల్లికార్జునుడు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటు హక్కుపై బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆర్ఓ మాట్లాడారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామం ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు విద్యాబోధన చేసి కుందనగుర్తి పాఠశాలకు బదిలీపై వెళ్తున్న హెచ్ఎం నాగబూషణ్ రెడ్డిని ఆ గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. బుధవారం పీఎంసీ చైర్మన్ రామాంజినేయులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది.

హామీని నెరవేర్చిన మంత్రి

ఆస్పరి: మండలంలోని బనవనూరు గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీని మంత్రి గుమ్మనూరు జయరాం నెరవేర్చారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ పెద్దరెడ్డి కల్వర్ట్ పనులను ప్రారంభించారు. బనవనూరు సమీంపలో ఉన్న కల్వర్ట్ శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈకల్వర్ట్ కూలితే ఇతర గ్రామాల నుంచి బనవనూరుకు రాకపోకలు నిలిచిపోతాయని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే కల్వర్ట్ నిర్మాణం కోసం రూ.4లక్షలు మంజూరు చేయించారు.

ఎమ్మిగనూరులో రూ. కోట్లతో అభివృద్ధి పనులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- పైపులైన్ పనులకు భూమిపూజ



మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజల అవసరాలకనుగుణంగా పలు వార్డుల పరిధిలో కోట్లాది రూపాయలతో మంచినీటి పైపు లైన్లు, సీసీ రోడ్లు నిర్మాణాలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 19వ వార్డులో రూ.3లక్షలతో ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ పూజేశ్వరు, వార్డు ఇన్‌చార్జ్ యూకే వీరేంద్రలతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణం నుంచి మిలటరీ కాలనీ మీదుగా వెంకటాపురం, సోగనూరు రోడ్డు, లక్ష్మణ్ టాకీస్ మీదుగా ఎస్ఎస్ ట్యాంక్ వరకు దాదాపు రూ.3కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణాలతో పాటు పట్టణంలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్రహరీల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. పట్టణంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి జీడీపీ నుంచి ఏఐఐబీ స్కీం కింద రూ.142కోట్లతో మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసి ఓవర్‌హెడ్‌ట్యాంక్‌ల ద్వారా కొళాయిలకు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ శరత్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోటేకల్ సచివాలయం–1లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ జాలవాడి లక్ష్మి, ఎంపీటీసీ నరసింహులు, జాలవాడి లక్ష్మన్న, శ్రీను, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.